ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 6 నవంబరు 2025


చేవెళ్ల : శివాలయం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


యాచారంలో దీపాలు వెలిగిస్తున్న మహిళ


షాద్‌నగర్ అర్బన్ : ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరం పుణ్యక్షేత్రంలో..


ఇబ్రహీంపట్నం : త్రిశక్తి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక శోభ

శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

జిల్లావ్యాప్తంగా కార్తీకపౌర్ణమి వేడుకలను బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. కార్తీక పున్నమి నేపథ్యంలో ఆలయాలను విద్యుద్దీపాలు, పూలు, మామిడితోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దేవాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు, హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు ఆలయాలకు వెళ్లి తమ ఇష్టదైవాలను దర్శించుకొని దీపారాధన చేశారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, నవంబరు 5

సంఘీగూడ ఔటర్ సర్వీస్ రోడ్డు

మూసివేత

అండర్ పాస్‌ను పరిశీలించిన ట్రాఫిక్ ఏసీపీ


ఔటర్ సర్వీస్ రోడ్డును పరిశీలిస్తున్న ఏసీపీ నాగభూషణం

శంషాబాద్‌రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని సంఘీగూడ చెరువులోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో వరద ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై పారుతోంది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం అక్కడికి చేరుకొని పరిశీలించారు. సర్వీస్ రోడ్డును మూసివేసినట్లు ఆయన తెలిపారు. దీంతో పెద్దగోల్కొండ ఎగ్జిట్ 15 నుంచి పీ1 రోడ్డులో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పెద్దగోల్కొండ ఎగ్జిట్ 15 దగ్గర నుంచి కాకుండా తొండుపల్లి ఎగ్జిట్ వద్ద దిగాలని వాహనాదారులకు ట్రాఫిక్ పోలీసులు సూచించారు. వరద తగ్గిన తర్వాత ఔటర్ సర్వీస్ రోడ్డును పునరుద్ధరిస్తామని ట్రాఫిక్ ఏసీపీ తెలిపారు. ఆయన వెంట ట్రాఫిక్ సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్సైలు ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో చాంపియన్‌గా రంగారెడ్డి


6

హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి మృత్యు కుహరంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో అనేక మంది మృత్యు ఒడిలోకి చేరుతుండటంతో వారి కుటుంబాలు తీరని శోకం మిగులుతోంది. అసలు ఈ పాపానికి కారణం ఎవరు...? వారి గుండెకోతకు బాధ్యులెవరు...? ఇన్ని ఘోర ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు, అధికారులకు పట్టింపు లేదా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్థానిక నేతల నిర్లక్ష్యం కారణంగానే ఈ హైవే విస్తరణ పనులు ముందుకు సాగడం లేదని విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి వెళ్లాలంటే తరచూ ఇదే రహదారి నుంచి వెళ్తుం టారు. సీఎం వెళ్లే రోడ్డు దుస్థితే ఇలా ఉంటే.. మిగతా రహదారుల పరిస్థితి ఏమిటని నిలదీస్తు న్నారు.


ఇరువైపుల భారీ వృక్షాలతో బీజాపూర్ హైవే, మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం(ఫైల్)

ఈ పాపం ఎవరిదీ?



హైదరాబాద్ - బీజాపూర్ హైవే పనులకు వృక్షాలే అడ్డంకా?

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : హైదరాబాద్ నగర శివార్లలోని మీర్జాగూడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న ఈ దుర్ఘటనలో 19 మంది మృతి చెందగా 34 మంది గాయాలపాలైన సంగతి తెలిసిందే. నగర శివార్లలో ఇంత ఘోర ప్రమా దం జరిగిన దాఖలాల్లేవు. ఈ ప్రమాద ఘటన ఎన్నో కుటుంబాలను ఛిద్రం చేసింది. ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాధ. తల్లి, తండ్రి

మిగతా 7వ పేజీలో...

- ఈ ప్రాంత నేతలు, అధికారులకు బాధ్యతేదీ?
- సీఎం తరచూ వెళ్లే రహదారికి మరమ్మతులు ఎందుకు చేయడం లేదు?
- నిర్మాణ పనులను కాంట్రాక్ట్ సంస్థ ఎందుకు నిలిపివేసింది?
- ఓ రాజకీయ నేత బెదిరింపులేనంటూ గతంలో ప్రచారం
- ఇంకెంత మందిని చంపుతారంటున్న స్థానికుల ప్రశ్నలకు సమాధానాలేవీ?
- ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్న నేతలు

నిరుపేదల సొంతింటి కలను

నెరవేరుస్తాం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


లబ్ధిదారులకు అలాట్‌మెంట్ పత్రాలు అందజేస్తున్న మంత్రి

ఇబ్రహీంపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని ప్రతీ నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేపట్టి అమలు చేస్తున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గంలోని మంఖాల్‌లో మొదటి, రెండు ఫేజుల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కోర్టు కేసు కారణంగా మంఖాల్-1, మంఖాల్-2 ఫేజుల్లో నిర్మించిన ఇళ్ల పంపిణీ ఆగిపోయిందని, కోర్టులో కేసు త్వరగా పరిష్కారమయ్యేలా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చొరవ తీసుదన్నారు. పెండింగ్‌లో ఉన్న 2,848మందికి డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇక్కడ డబుల్ బెడ్ రూం ఇళ్లలో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం ఇళ్లు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ డి.చంప్లానాయక్, కందుకూరు ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మాక్‌డ్రిల్

శంషాబాద్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మంగళవారం రాత్రి 10గంటలకు సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు, ఫైర్ సిబ్బంది, అంబులెన్స్ సిబ్బంది, స్థానిక పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. విమానం టేకాఫ్ తీసుకున్న తరువాత పొగమంచు కారణంగా ప్రమాదం జరిగితే ఎలా స్పందించాలనే దానిపై సిఫ్ట్ జీవో ఐసీఎస్‌హెచ్ వికాస్‌మాలిక్ పర్యవేక్షణలో విమానం నుంచి ప్రయాణికులను దించి ఎయిర్‌లైన్స్ సిబ్బందిని ఎస్కార్ట్‌లో బస్ గేట్ ద్వారా అరైవల్ హాల్‌కు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న ఏఎస్‌జీ బృందం బస్‌గేటు వద్దకు చేరుకుంది. ప్రయాణికులను సీఐఎస్ఎఫ్ ఎస్కార్ట్ చేసింది. జీఎంఆర్ సిబ్బంది, ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు అవసరమైన సహాయం అందించారు. అనంతరం ప్రయాణికులు ఎయిర్‌లైన్ సిబ్బంది డొమెస్టిక్ ట్రాన్స్‌ఫర్ షాకు తీసుకెళ్లారు. అక్కడ వారిని తిరిగి బోర్డింగ్ గేట్ ప్రాంతంలోకి అనుమతించే ముందు తిరిగి భద్రత తనిఖీలు జరిగాయి. కాగా మాక్ డ్రిల్ రాత్రి 10.40 గంటలకు విజయవంతంగా ముగిసింది.

మైసిగండి కుంభహారతిలో భక్తులు



గండి మైసమ్మకు దండిగా మొక్కులు

మైసిగండిలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- శోభాయమానంగా మైసమ్మకు అలంకరణ
- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి క్షీరాభిషేకం, కుంభహారతి
- ఉత్సవాలను ప్రారంభించిన ఆలయ ఫౌండర్‌ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ

కడ్తాల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్తీక పౌర్ణమి మొదలు కార్తీక షష్టి వరకు ఆరు రోజుల పాటు కనుల పండువగా కొనసాగే

మిగతా 8వ పేజీలో...


అమ్మవారికి క్షీరాభిషేకం


శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో..





● సూపర్ మూన్

కార్తీక పర్వదినాన బుధవారం రాత్రి ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బీవర్ సూపర్ మూన్ అని పిలిచే ఈ ఘట్టంలో చంద్రుడు భూమికి అత్యంత దగ్గరగా దర్శనమిచ్చాడు. సుమారు 28,000 కిలోమీటర్ల దూరంలో భూమికి దగ్గరకు చేరుకున్నాడు. ఈ దృశ్యం సాధారణం కంటే 14 శాతం పెద్దగా, 30శాతం ఎక్కువ కాంతివంతంగా దర్శనమిచ్చాడు. ఈ అపురూప దృశ్యాన్ని జిల్లా వాసులు చూసి తరించారు. - ఆంధ్రజ్యోతి రంగారెడ్డి జిల్లా ఫొటోగ్రాఫర్

విమానంలో ప్రయాణికుడికి తీవ్ర అస్వస్థత

శంషాబాద్ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్



శంషాబాద్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బెంగళూర్ నుంచి 50 మంది ప్రయాణికులతో డిబ్రూఘర్‌కు మంగళవారం రాత్రి 11గంటలకు బయలుదేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఐఎక్స్ 2945 విమానంలో ఉద్దేశ్వర్‌పెగ్ అనే ప్రయాణికుడికి కళ్లు తిరగడం, వాంతులు కావడం, తీవ్ర అస్వస్థతకు గురికావడంతో విమాన సిబ్బంది పైలెట్‌కు సమాచారం అందించారు. పైలెట్ దగ్గరలో ఉన్న శంషాబాద్ ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. అయితే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది వెంటనే ఇతర విమానాల రాకపోకలను నిలిపివేసి ఎయిరిండియా విమానానికి ఎమర్జెన్సీ ల్యాండ్‌కు అనుమతిచ్చారు. పైలెట్ విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. వెంటనే ఏఎంసీ ఎమర్జెన్సీ మెడికల్ సిబ్బంది ప్రయాణికుడిని ఎయిర్‌పోర్టు అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి, హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రయాణికుడితో పాటు మరో ఇద్దరు కుటుంబ సభ్యులు విమానం దిగారు. 47మందితో తిరిగి మధ్యాహ్నం బుధవారం 12 గంటలకు విమానం డిబ్రూఘర్‌కు బయల్దేరి వెళ్లింది.

భారీ వర్షం.. రైతన్నకు తీరని నష్టం


యాచారంలో నీట మునిగిన వరి పంట

యాచారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాలలో వరి పంట నీట మునిగిపోయింది. యాచారంలో రైతు ఏనుక జంగయ్యకు చెందిన రెండు ఎకరాల వరి పంట పూర్తిగా నీటమునిగి అడ్డంగా పడిపోయింది. పొలంలో నీరు నిలవడంతో ధాన్యం మొలకెత్తే పరిస్థితి ఉందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



చిన్నారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

పరిహారం చెక్కులు అందజేసిన అధికారులు

తల్లిద్రండులు కోల్పోయిన బాలికల బాధ్యత తీసుకుంటా

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు,యాలాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మీర్జాగూడ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాల ఇళ్ల వద్దకు అదనపు కలెక్టర్ సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌తో కలిసి వెళ్లి ప్రభుత్వం తరుపున రూ.7లక్షల చొప్పున ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనాథలైన హాజీపూర్‌కు చెందిన ఇద్దరు పిల్లలను చదివించే బాధ్యత తీసుకుంటానని, అలాగే వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఈ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల గ్రామమైన పేర్కంపల్లికి వెళ్లి వారి తండ్రి ఎల్లయ్యగౌడ్‌కు చెక్కును అందజేశారు. లక్ష్మీనారాయణపూర్ మృతి చెందిన అఖిలారెడ్డి ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఇందిరమ్మ కాలనీ, గౌతాపూర్, వాల్మీకినగర్, బృందావన్ కాలనీలో మృతుల కుటుంబాల ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించడంతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఆర్టీసీ ఆర్ఎం శ్రీలత, డిప్యూటీ ఆర్ఎం సరస్వతి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ రవిగౌడ్, నాయకులు, తదితరులు ఉన్నారు.

తేమశాతం పేరుతో రైతులను వేధించొద్దు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

మంచాల/ఇబ్రహీంపట్నం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తేమశాతం పేరుతో అన్నదాతలను వేధింపులకు గురిచేయవద్దని, ఆఖరి గింజ వరకు కొనుగోళ్లు చేపట్టాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి యంత్రాంగాన్ని ఆదేశించారు. బుధవారం ఆయన మంచాలలో, ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డుల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఏసీపీ రాజు, ఎంపీడీవో బాలశంకర్ సీఐ మధు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడీఏ సుజాత, అడిషనల్ డీఆర్డీవో జోయప్ప, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి సంతోష్ కుమార్, డీపీఎంలు జయశ్రీ, యాదయ్య, ఏపీఎం బాలశివుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రగతిని కాంక్షించే వారు కాంగ్రెస్‌తో కలిసిరావాలని కోరారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ, కల్వకుర్తి మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. యూసుఫ్ గూడలోని పలు కాలనీల్లో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, మండ్లీ రాములు, నర్సింహ, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, జక్కు అనంత రెడ్డి, గుర్రం కేశవులు, కృష్ణానాయక్, శ్రీశైలం, కాసు శ్రీనివాస్ రెడ్డి, డోకూరు ప్రభాకర్ రెడ్డి, హన్మనాయక్, లక్పతి నాయక్, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, బీచ్యనాయక్, చేగూరి వెంకటేశ్, హీరాసింగ్, సాయిరెడ్డి, కొండల్ రెడ్డి, రమేశ్‌గౌడ్, మిట్టపల్లి అంజయ్య పాల్గొన్నారు.

నారా భువనేశ్వరి సేవలకు అంతర్జాతీయ ఖ్యాతి

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీగా నారా భువనేశ్వరి చేస్తున్న సేవలకు అంతర్జాతీయ ఖ్యాతి లభించిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు పేర్కొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ హోదాలో చేసిన సేవలకు డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డును, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీగా చేసిన సేవకు గోల్డెన్ పీకాక్ అవార్డు అందుకున్నారని తెలిపారు. లండన్‌లోని మే ఫెయిర్ హోలులో ఐఓడీ సంస్థ నుంచి రెండు ప్రతిష్టాత్మక అవార్డులను నారా భువనేశ్వరి అందుకున్నారని తెలిపారు. ఒక వైపు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ, అవినీతి రహిత పాలనను అందిస్తూ ఆదర్శనేతగా గుర్తింపు పొందుతుంటే, మరో వైపు ఆయన సతీమణి నారా భువనేశ్వరి చేస్తున్న సామాజిక సేవలకు ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ అవార్డు రావడం తెలుగు దేశం పార్టీలో నూతనోత్సవాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో చాంపియన్‌గా 'రంగారెడ్డి'



ఫుట్‌బాల్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టు

వికారాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా కొనసాగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (ఎస్‌జీఎఫ్) అండర్ -14 బాలురు, బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్రంలో పది ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. బాలికల విభాగంలో మెదక్ జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానంలో నల్లగొండ జిల్లా జట్టు, తృతీయ స్థానంలో రంగారెడ్డి జిల్లా జట్టు నిలిచాయి. బాలుర విభాగంలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలిచి ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానంలో హైదరాబాద్ జిల్లా జట్టు, తృతీయ స్థానంలో ఖమ్మం జిల్లా జట్టు నిలిచాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వివిధ జిల్లాల జట్ల నుంచి రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశారు. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అనంతయ్య కప్‌లను అందజేశారు. ఈ పోటీల్లో బాలుర జట్ల పరిశీలకులుగా శ్రీనివాస్, బాలికల జట్ల పరిశీలకులుగా వడ్డెన్న వ్యవహరించారు. జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, ఎంఈవో బాబుసింగ్, జిల్లా క్రీడా ఉపాధ్యాయులు క్రీడాకారులకు అవసరమైన ఏర్పాట్లు కల్పించడంలో సహకారం అందించారు.



ప్రమాదకరంగా బీజాపూర్ హైవేపై మలుపు

ఈ పాపం ఎవరిదీ?

(ఐదో పేజీ తరువాయి)

చనిపోయి కొందరు పిల్లలు అనాథలుగా మిగిలిపోయారు. మరికొందరు తల్లి దండ్రులు పిల్లలందరినీ కోల్పోయి తీవ్ర గుండెకోతతో విలవిల్లాడుతున్నారు. కుటుంబానికి ఆధారమైన వారిని కోల్పోయి మరికొందరు దిక్కులేని వారయ్యారు. కొన్నాళ్లుగా అసలు మరమ్మతులకే నోచుకోకుండా ఉన్న గుంతలు, మలుపులమయంగా మారిన ఈ రహదారి వల్లే ఈ ప్రమాద ఘటన చోటు చేసుకుంది. ఇదే కాదు... కొన్నాళ్లుగా ఈ రహదారి మృత్యుకుహరంగా మారి నిత్యం అనేక మంది ప్రాణాలు తీస్తూనే ఉంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కూడా గతంలో అనేక ప్రత్యేక కథనాలు కూడా ప్రచురించింది. ఎన్నేళ్ల కిందట జాతీయ రహదారిగా మారిన ఈ హైదరాబాద్- బీజాపూర్ హైవే విస్తరణ పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో పాటు అసలు మరమ్మతులకు నోచుకోకపోవడంతోనే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ఈ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలకు కారకులెవరూ..? ఏటా పదుల సంఖ్యలో జరుగుతున్న ప్రమాదాల కారణంగా అనేకమంది మృత్యువాత పడి వారి కుటుంబాలకు గుండెకోత మిగలడానికి బాధ్యులెవరూ? ఈ పాపం ఎవరిదీ? అని జనం ప్రశ్నిస్తున్నారు.

పదేళ్లుగా అడ్డంకులు

హైదరాబాద్- బీజాపూర్ హైవే విస్తరణకు 2015లో ఆమోదం లభించినప్పటికీ పదేళ్లైనా ఈ పనులు 25శాతం కూడా పూర్తి కాలేదు. విస్తరణ పనులకు కేంద్రం మొత్తం రూ.956 కోట్ల నిధులు విడుదల చేసింది. ఔటర్ రింగురోడ్డు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46కి.మీ మేర నాలుగు లేన్ల రహదారి విస్తరణకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తిచేసింది. ఈ రోడ్డు నిర్మాణ పనులను 'మేఘా' ఇన్‌ఫ్రా సంస్థ రూ.786 కోట్లకు దక్కించుకుని రోడ్డు విస్తరణ మొదలు పెట్టింది. దాదాపు భూసేకరణ పూర్తయి కొన్నిచోట్ల పనులు మొదలైనప్పటికీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలు తొలగిస్తున్నారంటూ పర్యావరణ వేత్తలు హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)ను ఆశ్రయించారు. దీంతో ఈ పనులన్నీ ఎక్కడికక్కడే ఆగిపోయాయి. మరోవైపు రోడ్డు నిర్మాణ సంస్థ కొంత నిర్మాణ సామగ్రిని కూడా ఇక్కడ నుంచి తరలించింది. అయితే ఇటీవల 765 మర్రి వృక్షాలను రక్షించేలా అలైన్‌మెంట్ మార్పు చేసి మరో 150 వృక్షాలను రీలొకేట్ చేసేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో సేవ్ బనియన్స్ సంస్థకు చెందిన పర్యావరణ వేత్తలు కేసు విత్ డ్రా చేసుకున్నారు. దీంతో ఎన్జీటీ గత నెల 31న స్టే ఎత్తివేసి పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

స్థానిక నేతలపై ప్రజాగ్రహం

మీర్జాగూడ రోడ్డు ప్రమాద ఘటన తరువాత బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన ఆయా పార్టీల నేతలను స్థానికులు గట్టిగానే నిలదీశారు. మాజీ మంత్రి సబితారెడ్డి, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డితో పాటు స్థానిక ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యను అడ్డుకునే యత్నం చేశారు. 'రోడ్లు ఇంత అధ్వానంగా ఉంటే ఇన్నాళ్లు మీరేమి చేస్తున్నారు?.. మీ వల్ల మాకు దుర్గతి పట్టిందని" జనం నిలదీయడంతో పాటు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. అయితే ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో నేతలు వివరణ ఇచ్చుకునే యత్నాలు చేస్తున్నారు. ఈ పాపం మాది కాదు... అవతల పార్టీ వారిదంటూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఈ పాపం మాది కాదు.. ఫలానా పార్టీ వారిదంటున్నారు. ఇలా స్థానిక నేతలు తమ బాధ్యతలేనట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో రోడ్డు రవాణా శాఖ మంత్రిగా పనిచేసిన మహేందర్‌రెడ్డి ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహించినా ఈ రోడ్డు మరమ్మతుల విషయాన్ని ఆయన పెద్దగా పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. అలాగే గ్రీన్‌ట్రిబ్యునల్ కేసుల కారణంగానే రోడ్డు విస్తరణ పనులు జాప్యమవుతున్నాయని నేతలు చెబుతున్నారు. కానీ ఈ రోడ్డు విస్తరణ పనుల్లో గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు ఒక్కటే కారణం కాదనే విమర్శలు ఉన్నాయి. ఇది నిజమైతే పదేళ్లుగా ఈ సమస్యను ప్రభుత్వాలు ఎందుకు పరిష్కరించలేకపోయాయి..? లోపం ఎక్కడ ఉంది..? ఇది అంతు చిక్కని వ్యవహారం. ఇదిలా ఉంటే కోర్టు కేసుకు ముందు పనులు మొదలైన సమయంలో ఓ స్థానిక నేత కాంట్రాక్టర్‌ను ఇబ్బందులకు గురి చేసినట్లు ఆరోపణలున్నాయి. దీంతో గత ఎన్నికలకు ముందు నిర్మాణ సంస్థ భారీగా తెచ్చి పెట్టిన నిర్మాణ సామగ్రిని వేరే ప్రాంతానికి తరలించిందని ప్రచారం జరిగింది.

తరచూ సీఎం వెళ్లే రహదారే ఇలా ఉంటే..

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి వెళ్లేందుకు ఆయన తరచూ ఇదే రహదారిలో వెళుతుంటారు. అయినా ఈ రహదారి విస్తరణ సంగతి దేవుడెరుగు కనీసం మరమ్మతులకు నోచుకోవడం లేదు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ రోడ్డు విస్తరణ పనులను సమీక్షించి త్వరగా పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంపై రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలో ఢిల్లీ వెళ్లి కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి గడ్కారీని కలిశారు. అయితే తరువాత దీన్ని సరిగా ఎవరూ పట్టించుకోలేదు. కోర్టు కేసులు ఉండి రహదారి విస్తరణ పనులు ఆగిపోతే నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారిపై ఉన్న గుంతలు పూడ్చడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎందుకు చొరవచూపడం లేదు. సీఎం వెళ్లే రహదారికే ఈ దుస్థితి ఉంటే.. స్థానిక ప్రజలు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

కోలుకుంటున్న క్షతగాత్రులు

చేవెళ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో జరిగిన క్షతగాత్రులు చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. మూడు రోజులుగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. బుధవారం సైతం క్షతగాత్రులకు అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రిలో మొత్తం 13 మంది క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. ఇందులో ఎవరికీ కూడా ప్రమాదం లేదని, వైద్యులు స్పష్టం చేశారు. వారందరి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని వైద్యులు స్పష్టం చేశారు.



చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో కోలుకుంటున్న క్షతగాత్రులు



నివాళులర్పిస్తున్న తాండూరు ప్రజలు

తాండూరులో కొవ్వొత్తుల ర్యాలీ

మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తాండూరుకు చెందిన 13 మంది దుర్మరణం చెందిన ఘటనపై బుధవారం పట్టణ పౌరసమాజం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ నుంచి ఇందిరా చౌక్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

- తాండూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి)

కీసరగుట్టకు పోటెత్తిన భక్తజనం



రామలింగేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర/కీసర రూరల్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కీసరగుట్ట రామలింగేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం భక్తులు భారీ సంఖ్యలో రావడంతో ఆలయ నిర్వాహకులు తెల్లవారుజాము నుంచే అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి దర్శనాల కోసం భక్తులు క్యూలో వేచి ఉన్నారు. రద్దీని బట్టి స్థానికులకు, సిఫారస్సు చేసిన వారిని నిలిపివేశారు. దీంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, ఆలయం వెలుపల ఉన్న శివలింగాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ మహా మండపంలో దీపోత్సవం, ఆలయ ధ్వజ స్తంభం వద్ద జ్వాలాతోరణం కనుల పండువగా సాగింది. ఎమ్మెల్యే మల్లారెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు స్వామివారిని దర్శించుకొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే కీసర రామలింగేశ్వర స్వామి వారిని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సతీమణి సుధాదేవ్ వర్మ దర్శించుకున్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

సంకల్ప సిద్ధిగా పేరుగాంచిన చీర్యాల్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున్న భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు మల్లారపు లక్ష్మీనారాయణ, శ్రీహరిగౌడ్ విడతల వారీగా వ్రతాలకు అనుమతి ఇచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు.



బుగ్గజాతరలో కార్తీక స్నానాలు ఆచరించడానికి తరలివచ్చిన భక్తులు

బుగ్గ జాతరకు కార్తీక శోభ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, నవంబర్ 5(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీ శ్రీ బుగ్గరామలింగేశ్వర క్షేత్రం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీక పౌర్ణమి బుధవారం తెల్లవారు నుంచే వేలాదిగా భక్తులు తరలివచ్చి కుటుంబ సమేతంగా పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి నైవేద్యం సమర్పించారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే

ప్రజలంతా పాడిపంటలతో సభిక్షంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆయన బుగ్గ రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బుగ్గక్షేత్రంలో నూతనంగా నిర్మించిన లడ్డూ ప్రసాద వితరణ కేంద్రాన్ని ప్రారంభించారు.

ఘనంగా జ్వాలా తోరణం



ఘట్‌కేసర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీరామ కల్యాణ కామేశ్వరి నవశక్తి దేవాలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాలకు భక్తులు బారీగా తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి, పూజారి శివకుమార్ శర్మ, ప్రసాద్, పాశం హన్మంత్‌రెడ్డి, వీరేశం, సుదాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, డీజీ నాయక్, రమేష్, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కాగ్నాకు గంగా హారతి



తాండూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని బుధవారం యాలాల మండలం కోకట్ గ్రామ సమీపంలోని కాగ్నా నది వంతెన పక్కన కార్తీక పౌర్ణమి గంగా హారతిని ఘనంగా నిర్వహించారు. వినాయక ఉత్సవ సమితి, వేద బ్రహ్మణ, తాండూరు బ్రహ్మణ అర్చక పురోహిత సంఘం పర్యవేక్షణలో గంగా హారతి నిర్వహించారు. సాయంత్రం జరిగిన ఈ హారతి కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గంగలో హారితిని వదిలారు. వేద బ్రహ్మణులు గంగా హారతి ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న పర్యావరణ వేత్త డాక్టర్ బాబురావు

ఫార్మాసిటీని రద్దు చేయాల్సిందే..

కార్పొరేట్ శక్తులకు అండగా ప్రభుత్వాలు.. రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

యాచారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం పేదల భూములు తీసుకొని వారిని రోడ్డున పడేసిందని, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఫార్మాసిటీని రద్దు చేయకుండా మోసం చేసిందని ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్‌బాబురావు, ప్రముఖ జర్నలిస్టు పాశంయాదగిరి ఆరోపించారు. ఏది మేమైనా విషతుల్యమైన ఫార్మాసిటీని రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఫార్మాసిటీ పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాల అన్యాయం ఇంకెన్నాళ్లు, రైతులకిచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్, తదితర అంశాలపై పర్యావరణ వేత్తలు, శాస్త్రవేత్తలు, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చటి పొలాల మధ్య ఫార్మా కంపెనీల ఏర్పాటుకు పేదల భూములు తీసుకోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటున్నాయని విమర్శించారు. మా భూములు తీసుకోరాదని ఆనాడు సర్పంచులు, ఎంపీటీసీలు డిమాండ్ చేసినా ఆనాటి ప్రభుత్వం ఫార్మాసిటీకి భూములు తీసుకోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఎందుకు నిలుపుకోలేదని ప్రశ్నించారు. ఏకంగా 2,500 ఎకరాలను నిషేదిత జాబితాలో పెట్టి ప్రభుత్వ పథకాలు వర్తించకుండా నిషేదం విధించడం దారుణమన్నారు. రైతులు, యువత, మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు కలిసి పోరాటాలు చేస్తే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఫ్యూచర్‌సిటీ పేరుతో మరిన్ని భూములు తీసుకోవడం సమంజసం కాదన్నారు. నిషేదిత జాబితాలో ఉన్న భూములను రైతుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆ భూముల్లో పండుతున్న వరి, పత్తి ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా ప్రభుత్వం నిషేదం విధించడం దారుణమన్నారు. సమావేశంలో వి.సంధ్య, బండారి లక్ష్మయ్య, కన్నెగంటి రవి, డాక్టర్ బాబురావు, ఆర్.వెంకటరెడ్డి, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కవుల సరస్వతి, గణేష్, సందీప్‌రెడ్డి, యుగందర్ రెడ్డి, అనసూయ, బర్లమల్లేష్, దేవోజీ పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా..

పట్టించుకోరా?

రహదారుల నిర్మాణాలపై కాంట్రాక్టర్ల అలసత్వం!

మీర్జాగూడ ఘటన నేపథ్యంలో రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇప్పటికైనా మేల్కొని పనులు పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే సేవ్ తాండూరు పేరిట తాండూరు డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నారు. తాండూరు నియోజకవర్గానికి బీటీ పనుల నిమిత్తం సుమారు రూ.300 కోట్లు మంజూరైనా కొన్నిచోట్ల పనులే ప్రారంభం కాలేదు. మరికొన్ని చోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి.



తాండూరు - పెద్దేముల్ రోడ్డు మార్గంలో గుంతలమయంగా రోడ్డు

- మంత్రి మందలించినా నత్త నడకనే..
- నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- రోడ్ల కోసం రోడ్డెక్కుతున్న ప్రజలు
- 'సేవ్ తాండూరు' పేరుతో మొదలైన ఉద్యమం
- మీర్జాగూడ ఘటనతో యాలాల రోడ్డుకు మరమ్మతులు



ధర్నా చేస్తున్న తాండూరు ప్రజలు(ఫైల్)



యాలాల రోడ్డుపై వెయిట్ మిక్స్ వేస్తున్న దృశ్యం

తాండూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తాండూరు - వికారాబాద్ రోడ్డు పనుల నిమిత్తం సుమారు రూ.100 కోట్లతో టెండర్ దక్కించుకున్న ఒక ఏజెన్సీ సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. ప్రధాన రోడ్డు మార్గమైన తాండూరు - వికారాబాద్ పనులు ప్రారంభం చేయించేందుకు పాలకులు, అధికారులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. రోడ్డు తవ్వి వదిలేసిన తర్వాత చిన్న చిన్న ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. సోషల్ మిడియా, పత్రికల్లో కథనాలు, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఒత్తిడితో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కొమటిరెడ్డివెంకట్‌రెడ్డి సెప్టెంబర్ 7న పనుల జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో నెల తర్వాత ఖాంజాపూర్ నుంచి కందనెల్లి వరకు వికారాబాద్ రోడ్డు పనులు ప్రారంభించారు. అయితే ఈ పనులు కూడా నత్తనడకగానే సాగుతున్నాయి.

ప్రజాగ్రహం.. పనులు మొదలు

సదరు కాంట్రాక్టర్‌కు రాజకీయ అండదండలు, పర్సంటేజీలు, బంధుఘనం ఉండడంతో ఎప్పుడు పనులు చేపట్టినా ఎవరూ ఏమి అనలేని పరిస్థితి ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో గుత్తేదారులు స్పందించక తప్పడం లేదు. ఇన్నాళ్లు సోయి లేకుండా వ్యవహరించిన ఆర్‌అండ్‌బీ సిబ్బంది బుధవారం లక్ష్మీనారాయణపూర్ నుంచి యలాల వెళ్లే దారిలో గుంతలపై వెయిట్ మిక్స్ పోయించడం చర్చనీయమైంది. తాండూరు - పెద్దేముల్ రోడ్డు కోసం గాజీపూర్ గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు. గతంలో ఆర్‌అండ్‌బి శాఖలో గ్యాంగ్‌మెన్‌లు రోడ్ల గుంతలను తాత్కాలికంగా పూడ్చివేసేవారు. ఇప్పుడు వారు లేకపోవడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పాడినా పట్టించుకునే వారే లేరు.

నిలిచిన రోడ్డు పనులివే..

- తాండూరు బస్టాండ్ నుంచి సెయింట్ మార్క్స్ హైస్కూల్ వరకు నాలుగు కి.మీ బీటీ రోడ్డు నాలుగు లేన్లుగా మార్చేందుకు రూ.25 కోట్లు మంజూరు చేశారు. డిసెంబర్ నాటికి పనులు పూర్తి కావాల్సి ఉండగా రూ.2 కోట్ల మేరకు మాత్రమే పనులు పూర్తి చేశారు.
- గౌతాపూర్ నుంచి కరన్‌కోట్ వరకు ఐదు కి.మీ. రూ.8 కోట్ల వ్యయంతో రోడ్డు పనులు చేయాల్సి ఉండగా అగ్రిమెంట్ గడువు పూర్తయినా పనులు ముందుకు సాగడం లేదు.
- తాండూరు కోట్‌పల్లి మార్గంలోని అంతారం నుంచి పెద్దేముల్ వరకు 9కి.మీకు రూ.8 కోట్లు మంజూరయ్యాయి. డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. ఈ పనులు తన వల్ల కాదని కాంట్రాక్టర్ రాత పూర్వకంగా అధికారులకు తెలిపినట్లు సమాచారం.
- అగ్గనూర్ - బషీరాబాద్ ప్లాంట్ గ్రాంట్ కింద బషీరాబాద్ - మైల్వార్‌కు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.150 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు చురుగ్గా సాగడం లేదు. బషీరాబాద్, మైల్వార్ రోడ్లకు టెండర్ ప్రక్రియ పూర్తి కాగా, అగ్గనూర్ - బషీరాబాద్ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి.
- బషీరాబాద్ - కరన్‌కోట్ డబుల్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.30కోట్లు మంజూరైనా పనులు ముందుకు సాగడం లేదు.

అధ్వాన రోడ్లకు నిధులు నిల్

యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ నుంచి దేవనూర్(12 కి.మీ.), పెద్దేముల్ మండలం మారేపల్లి నుంచి మదనంతపూర్(13 కి.మీ.) తాండూరు నుంచి యాలాల మండలం బాగాయిపల్లికి (10 కి.మీ) రోడ్లు, కోకట్ వద్ద కొత్త వంతెన నిర్మాణానికి రూ.220 కోట్లతో ప్రభుత్వానికి ప్రాతిపాదనలు పంపించారు. ఈ పనులకు ఇంకా నిధులు మంజూరు కాలేదు.

ప్రమాదకరంగా బారికేడ్లు

తాండూరు - కోడంగల్ రోడ్డు మార్గంలోని కాగ్నా నది బ్రిడ్జిపై పడిన భారీ రంధ్రాన్ని జూలైలో ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ పూడ్చివేశారు. అయితే అప్పుడు పెట్టిన బారికేడ్లు తొలగించలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి కావడంతో ఎక్కువ వాహనాలు ఈ రోడ్డు మార్గంలో వెళ్తుంటాయి. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు వాటిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

రెండేళ్లుగా పనులకు బ్రేక్

తాండూరు పట్టణం పోలీస్‌స్టేషన్ నుంచి సాయిపూర్ తాతగుడి మీదుగా హైదరాబాద్ ప్రధాన రోడ్డుకు కలిపే సీసీ, బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. టఫ్ ఐడీసీ కింద రెండేళ్ల క్రితం రూ.3 కోట్లు మంజూరు కాగా 3 కి.మీ రోడ్డు వేయాల్సి ఉంది. ఇందులో పోలీస్ స్టేషన్ నుంచి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వరకు సుమారు రూ.కోటితో సీసీ రోడ్డు వేశారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నుంచి సాయిపూర్ హనుమాన్ దేవాలయం వరకు సీసీ రోడ్డు వేయాల్సి ఉంది. తిరిగి అక్కడి నుంచి తాతగుడి మీదుగా కట్టమైసమ్మ ఆలయం నుంచి అయోధ్యనగర్ కాలనీల మధ్య హైదరాబాద్ రోడ్డును కలుపుతూ రూ.2 కోట్లతో బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. అయితే రెండేళ్ల క్రితం ఆ రోడ్డుపై కంకర పరిచి పైన ఎర్రమట్టి వేసి కాంట్రాక్టర్ వదిలేశాడు. దీంతో ఈ రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.



తాండూరు అయోధ్యనగర్ కాలనీలో దుస్థితి


యాచారం : నందివనపర్తిలోని జ్ఞాన సరస్వతీ మాత ఆలయ ప్రాంగణంలో శివలింగాకృతిలో దీపాలంకరణ

కార్తీక శోభ


శంకర్‌పల్లి : వీరాంజనేయస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. బుధవారం తెల్లవారుజాము నుంచే ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యుద్దీపాలు, పుష్పాలు, మామిడి తోరణాలతో దేవాలయాలను శోభాయమానంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు, హోమాలు నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి ఇష్టదైవాలకు మొక్కులు చెల్లించుకున్నారు.


మొయినాబాద్ రూరల్ : చిలుకూరు బాలాజీ శివాలయంలో దీపాలంకరణ


చేవెళ్ల : కౌనగట్టు శివాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు


కేశంపేట : తులసి కోట వద్ద మహిళ పూజలు


కొత్తూర్ : అనంత పద్మనాభ స్వామి పూజలో సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి దంపతులు


శంషాబాద్ : వెండికొండ సిద్దేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ఆమనగల్లు : భక్తమార్కండేయ ఆలయంలో భక్తులు


కడ్తాల్ : మైసమ్మ పూజలో ఏసీపీ లక్ష్మీనారాయణ


శంకర్‌పల్లి : చందిప్ప మరకత శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గండి మైసమ్మకు దండిగా మొక్కులు

(ఐదో పేజీ తరువాయి)

బ్రహ్మోత్సవాల కోసం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయాన్నే వేదపండితులు, బ్రాహ్మణులు, ఆలయ అర్చకులు సుప్రభాత సేవతో మైసమ్మ అమ్మవారికి మేలుకొల్పు పాడారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి స్నేహలతతో కలిసి ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ శిరోలి పంతూ అమ్మవారికి పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు సమర్పించారు. మైసమ్మ దేవత అమ్మవారి మూలవిరాట్‌ను శోభాయమానంగా అలంకరించి అర్చకులు రాధాకృష్ణ శర్మ, అమూల్యపతి, యాదగిరి, ఆనంద్, భానుప్రకాశ్, సంతోష్‌కుమార్, వెంకటరమణ, బీచ్యనాయక్‌లు పూజా కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారి కలశంతో మేళతాళాలు, బ్యాండు వాయిద్యాల మధ్య ఆలయ ఆవరణలో ఊరేగింపు నిర్వహించారు. ఈవో స్నేహలత తో కలిసి రామావత్ సిరోలిపంతూ ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకం, విశేష అలంకరణ, కుంభహారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామావత్ భాస్కర్‌వాగ్దేవి, చాట్ల లింగప్ప, ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆర్.పి.జ్యోతి అరుణ్ దంపతులు క్షీరాభిషేకం చేశారు.బ్రహ్మోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కుబడులు సమర్పించుకొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీజడ్పీటీసీ సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, ద్యాప విజితారెడ్డి, దశరథ్ నాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, మైసిగండి మాజీ సర్పంచ్ లు తులసీరామ్‌నాయక్, శేఖర్‌గౌడ్, తహసీల్దార్ ఆర్.పి జ్యోతి, ఆలయ నిర్వాహకుడు రామావత్ భాస్కర్, నాయకులు శ్రీరాములు, జవహర్‌లాల్ నాయక్, పాండు నాయక్, పంత్యానాయక్, తులసీరామ్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, చాట్ల వెంకటేశ్, చాట్ల సర్వేశ, సీత, ఆనంద్ రెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, కడ్తాల సీఐ గంగాధర్, ఎస్ఐ లు వరప్రసాద్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు అండగా ప్రభుత్వం

- చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్
- చేవెళ్లలో క్షతగాత్రులకు పరామర్శ


క్షతగాత్రుడిని పరామర్శిస్తునన భీంభరత్

చేవెళ్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని, బాధితులకు అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ తెలిపారు. ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటనలో గాయపడిఆ పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను బుధవారం భీంభరత్ పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పండ్లు పంపిణీ చేశారు. ఆయనతో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మొయినాబాద్ మండలాధ్యక్షుడు మాణెయ్య, చేవెళ్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు సుశాంత్, నాయకులు భిక్షపతి, కరణ్, నిరంజన్‌గౌడ్, కేబుల్ రాజు, చిలుకూరు రాజు, కార్యకర్తలున్నారు. కాగా, మొత్తం 13మంది క్షతగాత్రులు మహేందర్‌రెడ్డి జనరల్ ఆసుపత్రిలో కోలుకుంటున్నారు. మూడు రోజులుగా వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఎవ్వరికీ ప్రాణాపాయం లేదని, అందరి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలి


నీట మునిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, ముంపు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్, కేజీబీవీలోకి వర్షపు నీరు రావడంతో విద్యార్థులకు ఇబ్బందిగా మారిందని, అధికారులను తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు మండల కేంద్రంలోని పలు పాఠశాలల ప్రాంగణాలు, శివగంగ ఆలయంలోకి వర్షపు నీరు చేరడం బాధాకరమేనని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా రామచంద్రగూడ చెరువు అలుగు పారడంతో గ్రామంలోని కాలనీలు నీట మునగడం వంటివి కాకుండా ఆ చెరువు అలుగును వేరే చోట నుంచి దారి మళ్లించడమా? అలుగు లోతు పెంచడమా? అనే విషయాలను ఇరిగేషన్ అధికారులు, కలెక్టర్‌తో మాట్లాడి తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. అధికారులు, నాయకులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

చేవెళ్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కళాశాలకు చెందిన రూ.9వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు అనంతరెడ్డి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఫీజు బకాయిలు ఇవ్వకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించకుంటే స్థానిక ఎమ్మెల్యేను విద్యార్థులతో కలిసి ఏ కార్యక్రమంలోనూ పాల్గొనకుండా అడ్డుకుంటామన్నారు.

క్రైం కార్నర్

విద్యార్థుల గొడవ.. ఒకరికి గాయాలు

శంకర్‌పల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇక్ఫాయ్ కళాశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా.. ఒకరికి గాయాలయ్యాయి. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ కళాశాలలో బీబీఏ ఫస్టియర్ చదివే మణిహాస్‌రెడ్డి, థర్డ్ ఇయర్ చదివే హిమవర్ష్‌లు బుధవారం మధ్యాహ్నం పాత కక్షల కారణంగా కళాశాల వద్ద గొడవపడ్డారు. ఈక్రమంలో అప్పుడే పరీక్ష రాసి అటుగా వస్తున్న గౌతమ్‌రెడ్డి తన మిత్రుడైన ప్రణీత్‌పై దాడి చేస్తుండటం గమనించి ఆపేందుకు వెళ్లాడు. ఇంతలో మణిహాస్‌రెడ్డి తన వద్ద ఉన్న కత్తెరతో గౌతమ్‌రెడ్డిని గాయపరిచాడు. దాంతో అతడి భుజం కిందిభాగంలో గాయమైంది. తోటి స్నేహితులు శంకర్‌పల్లిలోని లలిత ఆసుపత్రికి తరలించారు. కాగా, గౌతమ్‌రెడ్డి బీటెక్ ఫైనలియర్ చదవగా.. బ్యాక్‌లాగ్స్ రాసేందుకని కళాశాలకు వచ్చాడు. మణిహాస్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు

33 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

శంకర్‌పల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 33 టన్నుల రేషన్ బియ్యాన్ని మోకిల పోలీసులు బుధవారం సాయంత్రం పట్టుకున్నారు. హైదరాబాదులో సేకరించిన బియ్యాన్ని లారీలో లోడ్ చేయగా.. తూకం వేసేందుకని మీర్జాగూడ పరిధిలో గల ధర్మకాంట వద్దకు రావడంతో ముందస్తు సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. 33 టన్నులు బియ్యంతో పాటు లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ ఆదిత్య, క్లీనర్ బిక్ష్యాయాదవ్‌లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నగరానికి చెందిన ఇబ్రహీం అనే వ్యాపారి బియ్యాన్ని అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు భావిస్తున్నారు.

ముగిసిన వీసా.. కెన్యా, ఉగాండా వాసులను స్వదేశాలకు పంపిన పోలీసులు

శంషాబాద్ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వీసా గడువు ముగిసి దేశంలో అక్రమంగా నివాసముంటున్న కెన్యా, ఉగాండాలకు చెందిన నలుగురు మహిళలను మంగళవారం అర్ధరాత్రి వారి స్వదేశాలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి పంపించారు తెలంగాణ పోలీసులు. ఉగాండాకు చెందిన కేథరిన్ నకాయే(30), కెన్యాకు చెందిన ముతుతియా ఆన్ వాంగుయి(35), లిడియా నక్యాంజీ(29), నకగోలో షమీమ్(27)లు కొంతకాలంగా వీసా గడువు ముగిసినా హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. అనైతిక కార్యకపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్వదేశాలకు పంపిచారు.

ఎయిర్‌పోర్టులో ముమ్మర తనిఖీలు

శంషాబాద్ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): భద్రతా అధికారుల హెచ్చరికల నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయం పెరిమీటర్ వాల్ చుట్టూ సీఐఎస్ఎఫ్, జీఎంఆర్ రక్ష సిబ్బంది, స్థానిక పోలీసులు బుధవారం జాయింట్ పెట్రోలింగ్ నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి 6:40 గంటల వరకు తనిఖీ కొనసాగింది. విమానాల రాకపోకలు సాగించే ప్రధాన రన్‌వే చుట్టూ ఏర్పాటు చేసిన వాల్ వద్ద ఏమైనా అనుమానిత జంతువులు, వస్తువులు, అడవి పిల్లులు కాని, ఇతర జంతువులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కాగా, తనిఖీల్లో ఎలాంటి జంతువులు కాని, వస్తువులు కాని కనిపించలేదని భద్రతా అధికారులు వివరించారు.

22 డ్రోన్ కెమెరాలు స్వాధీనం

శంషాబాద్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ నుంచి అక్రమంగా తీసుకొస్తున్న 22 డ్రోన్ కెమెరాలను పట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కస్టమ్స్ అధికారులు కథనం ప్రకారం.. ఈ నెల 3న తమిళనాడులోని మధురైకి చెందిన ముత్తు కోన్నప్పన్ సతీష్‌కుమార్ సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఎస్‌క్యూ 522 విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. అరైవల్ ప్రాంతంలో రెండు బ్యాగులను తమిళనాడుకు చెందిన అమ్మద్ అష్రఫ్ అలీకి అందజేశాడు. గమనించిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది బ్యాగులను తనిఖీ చేయగా 22 అనుమతి లేని డ్రోన్ కెమెరాలు, డీజేఐ మినీప్రో 5, రిమోట్స్ 22 ఉన్నట్లు గుర్తించి కస్టమ్స్ అధికారులకు అప్పగించారు. డ్రోన్ కెమెరాల విలువ దాదాపు రూ.26.7 లక్షలు ఉంటుందని కస్టమ్స్ అధికారులు తెలిపారు. నిందితుడిని కస్టమ్స్ కార్యాలయానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విమానాశ్రయంలో బ్యాగు మాయం

- ఫిర్యాదు చేసిన కొద్దిసేపటికే పట్టుకున్న పోలీసులు

శంషాబాద్ రూరల్, నవంబర్ 05 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బుధవారం ఉమ్రా యాత్రకు బయలుదేరిన ప్రయాణికుడి బ్యాగు మాయమైంది. ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ సీఐ కనకయ్య కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రయాణికుడు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. వాష్‌రూంకి వెళ్లి వచ్చేసరికి బ్యాగు కనిపించలేదు. దాంతో ఆర్జీఐఏ ఔట్ పోస్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తి అపహరించిన్నట్లు గుర్తించి బ్యాగును రికవరీ చేసి ఇచ్చారు. కాగా, అందులో విలువైన మందులు, వస్తువులు ఉన్నట్లు గుర్తించారు.

సంక్షిప్తంగా..

కందుకూరు : నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర ఐటీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం మహేశ్వరం మండల పరిధిలోని మంఖాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లకు సంబంధించి మొదటి విడత లబ్ధిదారులకు నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్‌లతో కలిసి మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి మంత్రిని సన్మానించారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కేశంపేట/మాడ్గుల : అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలని బీజేపీ జిల్లా సాంస్కృతిక శాఖ కో-కన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కురిసిన వర్షానికి సంతాపూర్‌లో దెబ్బతిన్న వరిపైర్లను పరిశీలించారు. అలాగే మాడ్గుల మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి.

ఆమనగల్లు : సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకుడు జిల్లెల్ల పెంటయ్యను సీపీఎం నుంచి సస్పెండ్ చేశారు. సీపీఎం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పిప్పల్ల శివశంకర్ ప్రకటించారు. పట్టణంలో సీపీఎం ఆమనగల్లు ఏరియా కమిటీ సమావేశం నాయకుడు పట్నం నర్సింహ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహేశ్వరం : మండల పరిధిలోని డబిల్‌గూడ గ్రామాన్ని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్ని విధాలుగా చిన్నచూపు చూస్తూ గ్రామానికి రోడ్డు వేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు కుండె వెంకటేష్ అన్నారు. గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని బుధవారం మండల పరిధిలోని డబిల్‌గూడ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

మొయినాబాద్ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, ఈ విషయంలో నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి విమర్శించారు. రోడ్లు, రహదారుల ఉద్యమ వేదిక కన్వీనర్ షాపురం శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం మొయినాబాద్ మండల కేంద్రంలో హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారిపై మండలంలోని అన్ని పార్టీలకు చెందిన నాయకులు మహాధర్నా నిర్వహించారు. హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను వెంటనే ప్రారంభించి యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాప్రతినిధులను రోడ్లపై తిరగనివ్వమని హెచ్చరించారు. అంజయ్యగౌడ్, మహేందర్‌రెడ్డి, ప్రభాకర్, రాజమల్లేష్, మహేష్, పాండు, మహేందర్, మణికంఠలతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.


మొయినాబాద్ రూరల్ : ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

పట్నం-ఆక్టోపస్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టండి


ఇబ్రహీంపట్నం : రోడ్డుపై నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

ఇబ్రహీంపట్నం : ప్రమాదకరంగా ఉన్న ఇబ్రహీంపట్నం-ఆక్టోపస్ నాగన్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని బీఎస్పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లిటి రాములు, గ్యార మల్లేష్‌లు డిమాండ్ చేశారు. బుధవారం బీఎస్పీ నాయకులు గుంతలుపడి ప్రమాదకరంగా ఉన్న రోడ్డుపై నిరసన తెలిపారు. ఇబ్రహీంపట్నం టౌన్ చిరవన రోడ్డు పక్కనే ఉన్న కుంట వద్ద రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ రహదారిపై వాహనాల రద్దీ పెరిగిందని.. రోడ్డుకు మోక్షం లభించడం లేదన్నారు. అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఇబ్రహీంపట్నం చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం ఎదుట పోస్టర్‌ను విడుదల చేశారు. నాయకులు కృష్ణప్రసాద్, శాంత, మంద రాజు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్-శ్రీశైలం హైవే విస్తరణ చేపట్టాలి

కందుకూరు : ప్రతి నిత్యం హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ నాయకుడు ఎలుక మేఘనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. 765వ నెంబర్ జాతీయ రహదారిపై మహేశ్వరం మండలం తుక్కుగూడ నుంచి కందుకూరు మీదుగా కల్వకుర్తి వరకు ప్రతి నిత్యం వాహనాల రద్దీ ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం అరు లేన్ల రోడ్డుగా విస్తరించేందుకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పడం తప్ప.. పనులు ఎందుకు ప్రారంభించడం లేదన్నారు. రోడ్ల విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యంతో పాటు గ్రామీణ, పట్టణాల రోడ్ల మరమ్మతులపై దృష్టిసారించాలని కోరారు. అంధ్ర, తెలంగాణలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని కోరారు.

ఫార్మాసిటీ భూముల్లో లైఫ్‌సైన్సెస్ హబ్ ఏర్పాటుకు సన్నాహాలు

- రోడ్డు మరమ్మతుకు టెండర్లు పిలిచిన ప్రభుత్వం

యాచారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ కోసం రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో సేకరించిన భూముల్లో లైఫ్ సైన్సెస్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మేడిపల్లి శివారులో ఏర్పాటు చేయనున్న ఈ హబ్‌కు రోడ్ల కనెక్టివిటీని అభివృద్ధి చేయనుంది. నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి తక్కళ్లపల్లి గేట్ నుంచి మేడిపల్లి ఫార్మా భూముల వరకు 15 కిలోమీటర్ల మేర రోడ్డు వేయడానికి ప్రభుత్వం ఐటీవల టీజీఐఐసీ అధికారుల పర్యవేక్షణలో టెండర్లు పిలిచింది. ఇందుకుగాను రూ. 24.46 కోట్ల నిధులను కేటాయించింది. ఈ నెల 12 వరకు టెండర్లు దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును వెడల్పు చేయడానికి చర్యలు తీసుకుంటోంది. మేడిపల్లి గ్రామంలో ఇప్పటికే సేకరించిన భూముల్లో అంతర్గత రహదారులను కూడా అభివృద్ధి చేయనున్నారు. ఆరు నెలల వ్యవధిలో రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా ఈ భూముల్లో ఐటీ కంపెనీలు ఏర్పాటు చేయడానికి కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బయో మెడికల్ పరిశోధన కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

చెట్టును ఢీకొన్న కారు

మొయినాబాద్ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి(163)పై గత సోమవారం టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటనలో 19మంది మృతిచెందిన ఘటన మరవకముందే మొయినాబాద్ మండల కేంద్రంలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఓ కారు చెట్టును ఢీకొట్టిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి చేవెళ్ల వైపు వెళ్తున్న ఓ కారు మొయినాబాద్ మండల కేంద్రం సమీపంలోని తాజ్‌హోటల్ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మర్రిచెట్టును ఢీకొంది. కారులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. కారు వెనకభాగం దెబ్బతింది. ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజ్‌హోటల్ ముందు రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

చౌదరిగూడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్ నాయక్ మండిపడ్డారు. బుధవారం వేపకుచ్చతండాకు చెందిన ఆకాశ్‌నాయక్‌ను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే, ఎంపీ క్యాంపు కార్యాలయ ముట్టడికి పిలుపు నివ్వడంతో విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.